
సంగారెడ్డిలోని ఎంసీహెచ్ ఆస్పత్రి పైకప్పుపై వేసిన ప్లస్ సింబల్


సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో జరిగిన దిశ సమావేశానికి హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డికి మొక్కను అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి


సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో జరిగిన దిశ సమావేశంలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

దిశ సమావేశంలో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ క్రాంతి వల్లూరు అధ్యక్షతన జరిగిన దిశ సమావేశంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్‌కు నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ హోదాలో తొలిసారిగా దిశ సమావేశానికి హాజరైన నిర్మలా జగ్గారెడ్డికి కలెక్టర్ మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితర ప్రముఖులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా అర్హులకు అందించే బాధ్యత అధికారులదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటు పడుతున్నాదని నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు.

సిందూర్‌కు మద్దతు

- సంగారెడ్డిలో సంఘీభావ ర్యాలీ
- సర్కారు ఆస్పత్రుల పెకప్పులపై 'రెడ్‌క్రాస్' పెయింటింగ్స్

సంగారెడ్డి క్రైం/ సంగారెడ్డి రూరల్, సంగారెడ్డి అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : పహాల్గంలో ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆర్మీ జవాన్లు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతు వెల్లువెత్తుతున్నది. సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు సంగారెడ్డిలో బుధవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఇప్పటికైనా పాకిస్థాన్ బుద్ధి తెచ్చుకొని శాంతియుతంగా ఉండాలని ఈ సందర్భంగా వారు సూచించారు. భారత సైన్యాన్ని చూసి గర్విస్తున్నానని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేసిన భారత సైన్యాన్ని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. ప్రభుత్వ ఆస్పత్రుల పైకప్పులపై మెడికల్ ఎమర్జెన్సీ అని గుర్తించేలా ప్లస్ ఆకారంలో పెయింటింగ్స్ వేశారు. సంగారెడ్డిలోని జీజీహెచ్-ఎంసీహెచ్‌తోపాటు 12 ఆస్పత్రుల పైకప్పుల రెడ్ క్రాస్ సింబల్ గీశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ పెయింటింగ్స్ వేసినట్లు టీజీఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి తెలిపారు.


సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

ప్రజల అభివృద్ధే మా లక్ష్యం

- ప్రభుత్వానికి చెందిన ప్రతీ రూపాయి ప్రజలకు అందాలి
- డీడీసీఎంసీ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు

సంగారెడ్డి క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అభివృద్ధే మా లక్ష్యం.. ప్రభుత్వ ప్రతీ రూపాయి ప్రజలకు అందాలి.. ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి.. అని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించేందుకు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (డీడీసీఎంసీ) సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి, కలెక్టర్ క్రాంతి వల్లూరు తదితరులు హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, గ్రామీణాభివృద్ధి, విద్యా, ఆరోగ్య రంగాల పనులపై చర్చించారు. ఎంపీ రఘునందన్ రావు ఆయా శాఖల పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు భవనాల నిర్మాణంలో ఆలస్యానికి గల కారణాలు అడిగారు. క్రీడాపథకాల అమలులో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ వ్యవసాయంలో జిల్లాకు కావలసిన అవసరాలను వివరించారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకే చేరాలన్నారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ సక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, దిశ కమిటీ సభ్యులు కాసాల సుధాకర్, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

- మెదక్ కల్చరల్, మే 7(ఆంధ్రజ్యోతి) :మెదక్ జిల్లా కేంద్రం కుమ్మరిగడ్డలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో జరుగుతున్న అమ్మవారి జయంతి వేడుకలకు ఎంపీ రఘునందన్‌రావు హాజరై పూజలు చేశారు. అలాగే కోదండ రామాలయంలోనూ ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు.

కేజీ టమాటా రూ. 5

రామాయంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట సంతలో టమాటా కేజీకి రూ.5 పలికింది. బుధవారం నాటి మార్కెట్‌లో రైతులు అత్యధికంగా టమాటా పంటలను తేవడంతో ధరలు పడిపోయాయి. మామూలుగా ప్రతి సంతలో 400 గంపల టమాటా వస్తుంది. కానీ ఈసారి రెండు వేల గంపల పంట రావడంతో రేట్లు తగ్గించి అమ్మారు.




సర్పంచ్ ఎన్నికల నిర్వహణ మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీకాలం ముగిసి ఇప్పటికీ 15 నెలలు గడిచాయి. అప్పటి నుంచి వివిధ కారణాలతో ఎన్నికల నిర్వహణ వాయిదా వేస్తూ వచ్చారు. ఇటీవలే రాష్ట్రంలో కులగణన పూర్తికాగా, రెండుమూడు నెలల్లో ఎన్నికల నిర్వహణ ఉంటుందని భావించిన ఆశావహులకు మళ్లీ నిరాశ తప్పేటట్లు లేదు. తాజాగా దేశమంతటా కులగణన చేపడతామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు మరింత సమయం పట్టే అవకాశమున్నది.

ఇప్పట్లో లేనట్టే!

ప్రశ్నార్థకంగా సర్పంచ్ ఎన్నికల నిర్వహణ

- కేంద్ర కులగణన నేపథ్యంలో మరింత జాప్యం
- ఆశావహుల ప్రయత్నాలకు మళ్లీ బ్రేక్
- రిజర్వేషన్లలో సామాజిక వర్గాల లెక్కలే కీలకం
- 15 నెలలుగా ప్రత్యేక అధికారుల పెత్తనం
- గ్రామాల్లో కుంటుపడుతున్న పరిపాలన



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే7 : ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్న చందంగా మారింది సర్పంచ్ ఎన్నికల పరిస్థితి. 2024 జనవరి నెలతోనే గత సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీకాలం ముగిసింది. ఇప్పటికి 15 నెలలు గడుస్తున్నా ఎన్నికల ఊసే లేదు. రాష్ట్రంలో కులగణన చేపట్టిన తర్వాతనే ఎన్నికలు నిర్వహిస్తామని వాయిదా వేస్తూ వచ్చారు. ఇటీవలనే కులగణన సైతం పూర్తయ్యింది. ఇక వచ్చే జూన్, జూలై మాసాల్లో పంచాయతీ ఎన్నికలు ఉంటాయని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఇంతలోనే తాము కూడా దేశమంతటా కులగణన చేపడతామని కేంద్రం ప్రకటించింది. దేశమంతా సామాజిక వర్గాల వారీగా లెక్కలు తీయాలంటే ఇప్పట్లో కాదనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో వచ్చే ఆరునెలల్లో కూడా ఎన్నికల నిర్వహణ ప్రశ్నార్థకంగానే మారింది. ఐదేళ్లకోసారి నిర్వహించే గ్రామపంచాయతీ ఎన్నికలు అనివార్య కారణాలతో వాయిదా పడుతూ వస్తున్నాయి. ఫలితంగా సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారులే 15 నెలలుగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొంటున్నాయి. ప్రత్యేకాధికారులు సరైన పర్యవేక్షణ చూపించకపోవడంతో పనుల నిర్వహణ భారంగా మారుతోంది. తాజా పరిణామాలతో మరో ఆరు నెలల పాటు ప్రత్యేకాధికారులే పెత్తనం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రెండేళ్లుగా ఎదురుచూపులే

2024 జనవరి నెలలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహిస్తారని ఆశావహులంతా ఆరు నెలల ముందు నుంచే సిద్ధమయ్యారు. గత ప్రభుత్వంలో చేపట్టిన రిజర్వేషన్లను పదేళ్ల పాటు అమలు చేస్తారని నాడు నిర్ణయించడంతో ఆ రిజర్వేషన్ల ప్రకారమే ఆశావహులు రంగంలోకి దిగారు. ఇంతలోనే గత ప్రభుత్వ స్థానంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పాత రిజర్వేషన్ల స్థానంలో కొత్త రిజర్వేషన్లు తెస్తామని ప్రకటించడంతో ఆశావహులు ఉసూరుమన్నారు. దీనికితోడు కులగణన చేపట్టడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతుండగానే యేడాది సమయం గడిచిపోయింది. ఇటీవలనే కులగణన పూర్తయ్యి రాష్ట్రంలోని సామాజిక వర్గాల వారీగా లెక్కలు సేకరించారు. ఇప్పటికైనా ఎన్నికలు జరుగుతాయనే ఊగిసలాటలో ఉండగానే కేంద్ర కులగణన పేరిట మరో పిడుగు ఆశావహుల నెత్తిన పడింది. ఇప్పటికే 2 సంవత్సరాలు ఎదురుచూసిన వారంతా మరో ఆరు నెలలు పాటు వేచిచూడక తప్పదేమోననే ప్రచారం జరుగుతోంది.

వచ్చే రెండు నెలలపై ఆశలు

ఆశావహులంతా జూన్, జూలై నెలలపై ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రంలో కులగణన పూర్తయిన క్రమంలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని ఎదురు చూస్తున్నారు. వేసవి దృష్ట్యా ప్రచారానికి, పోలింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతాయని భావించి జూన్ లేదా జూలై మాసాల్లో ఎన్నికల ప్రక్రియకు అనుకూలంగా ఉంటుందనే సంకేతాలు వచ్చాయి. ఆశావహులు సైతం అదే విశ్వాసంతో గుట్టుగా తమనుతాము ప్రజల్లో బలోపేతం చేసుకునే దిశగా సాగిపోతున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం దేశమంతటా కులగణన చేపడతామని తాజాగా ప్రకటించింది. తెలంగాణ రాష్ట్రంలోనూ మరోసారి కులగణన చేపట్టనున్నారు. ప్రస్తుతం యుద్ధ వాతావరణం కొనసాగుతున్న క్రమంలో ఇది పూర్తయ్యాకనే కులగణన మొదలవుతుందని అంచనా వేస్తున్నారు.



కుంటుపడుతున్న పాలన

గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిధుల కేటాయింపు నిలిచిపోయింది. కేంద్రం నుంచి నిధులు విడుదల కావడం లేదు. పల్లెల్లో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులతో కూడిన పాలకవర్గం ఉంటేనే ఆర్థిక సంఘంతోపాటు ఇతర నిధులు విడుదలవుతాయి. ప్రస్తుతం ప్రత్యేకాధికారులు

- మిగతా 5వ పేజీలో...



హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలి

- తలా ఒక రూపాయి చందా వేసుకుని గుడిని పునర్నిర్మించుకోవాలి
- త్రిదండి రామానుజ చిన జీయర్ స్వామి

4 లో

పంటల మార్పిడితోనే సుస్థిర ఆదాయం

- రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులే మేలు
- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములునాయక్

5

ఈసారి పాసయ్యేలా..

- ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- మెదక్ జిల్లాలోని 16 ప్రభుత్వ కళాశాలల్లో నిర్వహణ

తూప్రాన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఫెయిలైన విద్యార్థులపై ప్రత్యేక చొరవ తీసుకొని ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నది. మెదక్ జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకులు పక్కా ప్రణాళికతో తరగతులు నిర్వస్తున్నారు. అట్టడుగున ఉన్న ఉత్తీర్ణత శాతంలో మార్పులు తీసుకువచ్చే ప్రయత్నాలు జిల్లాలో సాగుతున్నాయి.


తూప్రాన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు

అట్టడుగున జిల్లా ఉత్తీర్ణత శాతం..

ఏప్రిల్ 22న విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మెదక్ జిల్లా అట్టడుగున నిలిచింది. ఫస్టియర్ ఫలితాల్లో 46.87 శాతంతో చివరి స్థానం, సెకండియర్ ఫలితాల్లో 59.40 శాతంతో 29వ స్థానంలో నిలిచింది. ఫస్టియర్‌లో 5,519 మంది విద్యార్థులకు 2,587 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 5,067 మంది విద్యార్థులకు 3,013 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మెదక్ జిల్లాలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 859 మంది, సెకండియర్‌లో 441 మంది ఫెయిల్ అయ్యారు.

ఫెయిలైన విద్యార్థులపై శ్రద్ధ

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదివి ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులపై ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని మౌఖిక ఆదేశాలు మాత్రమే చేసేవారు. కానీ ఈసారి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఇంటర్ విద్యా కమిషనర్, డైరక్టర్ కృష్ణచైతన్య ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఇంటర్మీడియట్ రిజల్ట్ నుంచి సప్లమెంటరీ పరీక్షల వరకు తరగతులు కొనసాగాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రత్యేక తరగతులను జిల్లా నోడల్ అధికారి, ప్రిన్సిపాల్స్ పర్యవేక్షణ చేయాలని సూచించారు.

16 కళాశాలల్లో తరగతులు

మెదక్ జిల్లాలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు టేక్మాల్, మెదక్ బాలుర, మెదక్ బాలికల, కొల్చారం, నర్సాపూర్, శివ్వంపేట, పెద్దశంకరంపేట, చిన్నశంకరంపేట, చేగుంట, రామాయంపేట, నార్సింగి, తూప్రాన్, కౌడిపల్లి, అల్లాదుర్గం, వెల్దుర్తి, పాపన్నపేట లలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఫెయిలైన విద్యార్థులకు సబ్జెక్టులవారీగా బోధన నిర్వహిస్తున్నారు. ఈ నెల 22 నుంచి ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనుండగా, 21 వరకు ప్రత్యేక తరగతులు కొనసాగనున్నాయి.

ప్రత్యేక తరగతుల పర్యవేక్షణ..



ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న తరగతులను పర్యవేక్షణ చేస్తున్నాం. విద్యార్థులతో మాట్లాడి ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విధంగా చూస్తూ, ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం.

- మాధవి, మెదక్ జిల్లా నోడల్ అధికారి



భరోసా కేంద్రం సిబ్బందితో కలిసి కేక్ కట్ చేస్తున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

భరోసా కేంద్రం సేవలు భేష్

- మహిళలు, బాలికల భద్రతకు పెద్దపీట
- సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి) : పోక్సో అత్యాచార కేసుల్లో మహిళలు, బాలికలకు భరోసా కేంద్రం పెద్దపీట వేస్తుందని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. సంగారెడ్డిలోని భరోసా కేంద్రం 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ పోక్సో, అత్యాచార కేసుల బాధితులకు అండగా నిలిచేందుకు సంగారెడ్డి జిల్లాలో 2020 సెప్టెంబరు 28న భరోసా కేంద్రాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అప్పటి నుంచి మెరుగైన సేవలతో ఈ కేంద్రం సిబ్బంది ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. సిబ్బంది బాధిత మహిళలను అక్కున చేర్చుకొని వారిలో కొండత ధైర్యాన్ని నింపుతున్నారని అభినందించారు. స్కూల్స్, కళాశాలలలో తరుచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. పోక్సో కేసు నమోదు అయినప్పటి నుంచి చివరి వరకు బాధితులకు అండగా ఉంటూ, నేరస్తులకు శిక్ష పడేలా చేయడమే భరోసా సెంటర్ల ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం అందించడంలో భరోసా సిబ్బంది ఎలాంటి అలసత్వం చూపరాదని, మరింత మెరుగైన సేవలందించాలి సూచించారు. జిల్లాలో భరోసా సెంటర్ ప్రారంభమైన నాటి నుంచి సత్ఫలితాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న భరోసా కో ఆర్డినేటర్ దేవ లక్ష్మీ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. బాధిత మహిళలకు విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్ కింద ఒక్కొక్కరికీ రూ.5వేల చొప్పున మొత్తం రూ.20వేల విలువగల చెక్కులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఎస్ఐ పూలబాయ్, భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి

● త్రిదండి రామానుజ చిన జీయర్ స్వామి

మర్కుక్, మే 7 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని కాపాడడానికి అందరూ ముందుండాలని శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని వరదరాజపురంలో బుధవారం నిర్వహించిన శ్రీ బూనీలా సమేత వరదరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్నజీయర్ స్వామి హాజరయ్యారు. గర్భగుడిలో యంత్ర ప్రతిష్ఠ చేసిన అనంతరం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ యాదవ్‌లతో కలిసి ఆయన గుడి ప్రాంగణమంతా తిరిగి పరిశీలించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నజీయర్‌స్వామి మాట్లాడుతూ ఈ గుడిని దాతల సహకారంతో నిర్మించి బ్రహ్మోత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహించుకుందామన్నారు. కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త గోపాలకృష్ణ, గొడుగు నరసింహులు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ గృహాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసే విషయంలో స్థానిక వనరులను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో సంబంధిత అధికారులకు సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలన్నారు. జిల్లాలో 1 లక్షా 74 వేల క్యూబిక్ మీటర్లు ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక అవసరం ఉంటుందని స్థానిక వనరుల ద్వారా ఇసుక సరఫరాకు గ్రౌండ్ వాటర్, రెవెన్యూ, మైన్స్ శాఖల సమన్వయం ద్వారా జాయింట్ సర్వే నిర్వహించాలన్నారు. జూన్ 2 నుండి జిల్లాలో ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహణపై ఆర్డీవోలకు తాసిల్దార్లకు కలెక్టర్ పలు సూచనలు, సలహాలు చేసారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, ఆర్డీవోలు, మెదక్ రమాదేవి, తూప్రాన్ జై చంద్రారెడ్డి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, మైనింగ్ అసిస్టెంట్ జువాలజిస్ట్ మధు కుమార్, ఆర్.ఐ. లక్ష్మీనారాయణ, సంబంధిత తాసిల్దారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గీతం విద్యార్థికి డాక్టరేట్

పటాన్‌చెరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి సీహెచ్. మంగమ్మ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'నిలువు పోరస్ ప్లేట్ అంతటా మాగ్నెటో హైడ్రోడైనమిక్ ద్రవ ప్రవాహం యొక్క వేడి, ద్రవ్యరాశి బదిలీ ప్రభావం' అనే అంశంపై ఆమె అద్భుతమైన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాల సిద్దులు మల్ల బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ మంగమ్మ అయస్కాంత ప్రభావంలో న్యూటోనియన్ కాని ద్రవ ప్రవాహాల సంక్లిష్ట ప్రవర్తనను అన్వేషించినట్లు తెలిపారు. ఆమె పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, తదితరులు అభినందించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మిస్సింగ్ కేసులో యువకుడి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మిస్సింగ్ కేసులో యువకుడి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన బుధవారం బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాటి గ్రామంలో జరిగింది. మహారాష్ట్రకు చెందిన దేవేంద్ర (28) మూడు రోజుల నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు వచ్చింది. ఈ నేపథ్యంలో దేవేంద్ర మృతదేహం ఓ ఇంటి నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్‌లో దొరికింది. మృతదేహాన్ని బీడీఎల్ పోలీసులు పంచనామా నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా ముగ్గురికి గాయాలు

రేగోడు, మే 7 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం రేగోడు మండలం ఆర్ ఇటిక్యాలలో జరిగింది. రేగోడు నుంచి వెళుతున్న ఆటో అదుపు తప్పి ఆర్ ఇటిక్యాల వద్ద బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న గ్రామానికి చెందిన బాలయ్య, శాంతయ్య, కృష్ణలకు గాయాలయ్యాయి. వారిని రేగోడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా వారికి ప్రథమ చికిత్స చేసి పంపించామని వైద్య సిబ్బంది సునంద తెలిపారు.

స్లాబ్ పైకప్పు కూలి ముగ్గురి కార్మికులకు తీవ్ర గాయాలు



కూలిన స్లాబ్

పటాన్‌చెరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): స్లాబ్ పైకప్పు కూలి ముగ్గురు కార్మికులకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం బీడీఎల్ పాటి గ్రామంలో జరిగింది. పోలీసులు అందించిన కథనం ప్రకారం పాటి గ్రామంలో నిర్మాణంలో వున్న కాలేజీ భవనం స్లాబ్ పైకప్పు కూలి ముగ్గురు కార్మికులకు తీవ్రమైన గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్లాబ్ కూలే సమయంలో కార్మికుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. మీడియా వాళ్లు, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టేపాలం తండాలో వాంతులు, విరేచనాలు



చికిత్స పొందుతున్న బాధితులు

రేగోడు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్టేపాలం తండాకు చెందిన పలువురు బుధవారం వాంతులు విరేచనాలతో రేగోడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. పట్టేపాలంతాండాలో మంగళవారం దసరా పండుగ జరుపుకున్నారని, ఫుడ్ పాయిజన్ వల్లే వాంతులు విరోచనాలు జరిగి ఉంటాయని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. వాంతులు విరోచనాలతో ఆసుపత్రికి వచ్చిన వారిని చికిత్స చేసి పంపించామని అన్నారు.

న్యూస్ బాక్స్

బీమా చెక్కు అందజేత

మాసాయిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు గణేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అయితే అతడికి పార్టీ సభ్యత్వం ఉండడంతో రూ.2 లక్షల బీమా చెక్కును మృతుడి తల్లి నాగమనికి ఎమ్మెల్యే సునీతా రెడ్డి తన నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, చౌదరి మాజీ సర్పంచ్ నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

మునిపల్లి, మే7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మునిపల్లి ఆదర్శ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి ఇంటర్మీయేట్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మునిపల్లి ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ మల్లిక బుధవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ మొదటి సంవత్సరంలో 40 చొప్పున సీట్ల కోసం ఈనెల 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఇంగ్లిష్ మీడియంకు ఫీజు లేకుండా ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొవచ్చన్నారు,

తారా కళాశాలలో దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్

సంగారెడ్డి అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ప్రవేశాలు పొందేందుకు జిల్లా స్థాయి దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, దోస్త్ కో ఆర్డినేటర్ డా.జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన అభ్యర్థులు, టెన్త్ మెమో, ఇంటర్ మెమో, ఆధార్ లింక్ చేయబడిన మొబైల్ నెంబర్, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డులతో మీసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దోస్త్ అడ్మిషన్లలో ఏమైనా సందేహాలు ఉంటే కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు. సందేహాల కోసం 9441069020, 7989239115 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా దేశవ్యాప్త సమ్మె

హత్నూర/నాగల్‌గిద్ద, మే 7 (ఆంధ్రజ్యోతి) : కార్మిక చట్టాలను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మారుస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి అన్నారు. హత్నూర మండలంలోని బోర్పట్ల, గుండ్లమాచునూర్, చందాపూర్ గ్రామ శివారులోని పరిశ్రమలో సమ్మె నోటీసు ఇచ్చారు. 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని నాగల్‌గిద్ద మండల పరిధిలోని కరసగుత్తి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారికి సీఐటీయూ డివిజన్, మండల బాధ్యులు రమేష్, గణపతి వినతిపత్రం అందజేశారు.

సోలార్ లైట్లు పంపిణీ

కోహీర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అటవీశాఖ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అటవీ శాఖ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్, బడంపేట గ్రామాల్లో అటవీ అధికారులు సోలార్ లైట్లను పంపిణీ చేశారు.

నేడు లింగాపూర్ రైతులతో అవార్డు విచారణ

నర్సాపూర్, మే 7(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి రీచ్ కెనాల్ కోసం భూములు కోల్పోతున్న నర్సాపూర్ మండలం లింగాపూర్‌లోని రైతులతో గురువారం భూసేకరణ అవార్డు విచారణ నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో మహిపాల్ తెలిపారు. బుధవారం ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ నేడు నర్సాపూర్‌లోని రైతువేదికలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే విచారణకు లింగాపూర్‌లో భూములు కోల్పోనున్న రైతులు హాజరై.. ఏమైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు.

గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

నాగల్‌గిద్ద, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న రైతు గుర్తింపుకార్డులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌చారి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో ఏఈవో వినయ్‌చౌహాన్‌తో కలిసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు.

మహిళ మృతదేహం కలకలం

చేగుంట, మే 7 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారి పక్కన గుర్తుతెలియని మహిళ మృతదేహం కలకలం రేపింది. మండల పరిధిలోని వడ్డారం శివారులో జాతీయ రహదారి పక్కన ఓ మహిళను కాల్చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఇది హత్యా..? ఆత్మహత్యా.. ? అనే కోణంలో విచారణ చేపడుతామని ఎస్ఐ చెప్పారు.

పంటల మార్పిడితోనే సుస్థిర ఆదాయం

- రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులే మేలు
- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములునాయక్


కంది మండలం మామిడిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర వ్యవసాయ కమీషన్ సభ్యులు రాములు నాయక్

కంది, మే 7 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పంటల మార్పిడితోనే సుస్థిర ఆదాయం లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములునాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మే 5 నుంచి జూన్ 10 వరకు చేపట్టిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా కంది మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో బుధవారం రైతులకు పంటల్లో లాభ నష్టాలు, వ్యవసాయ విధానంలో నూతన పద్ధతులు, లాభసాటి పంటలు, బిందు సేద్యం, ఉద్యానవనాల సాగు, సేంద్రియ ఎరువుల తయారీ తదితర అంశాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కిషన్, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్పందన, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్‌నాయక్ తదిరతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించుకోండి

పుల్‌కల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలని వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని బస్వాపూర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్, అగ్రికల్చరల్ రీసెర్చ్ స్టేషన్ బసంత్‌పూర్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమంలో భాగంగా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపతి షుగర్స్ పరిశ్రమ జనరల్ మేనేజర్ కృష్ణమోహన్, అగ్రికల్చరల్ యూనివర్సిటీ డాక్టర్ తబ్బసుమ్ ఫాతీమా తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి


సదస్సులో దరఖాస్తు స్వీకరణ వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ మాధురి

కొండాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి పేర్కొన్నారు. బుధవారం చెర్లగోపులారం, హరిదాస్‌పూర్ గ్రామాల్లో ఆమె సందర్శించి, రెవెన్యూ సదస్సులను పరిశీలించి మాట్లాడారు. దరఖాస్తుదారులు భూ సమస్యలకు సంబంధించిన సరైన పత్రాలు జతపరిచి, అధికారులు అడిగిన ప్రశ్నలకు జవాబుదారీతనంగా ఉంటే సులువుగా సమస్య పరిష్కారమవుతుందన్నారు. గతంలో భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ల కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, నేడు భూభారతి చట్టం అమలుతో రెవెన్యూ అధికారులు మీ గ్రామాలకు వచ్చి దరఖాస్తులు స్వీకరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ఈ సదస్సులో తహసీల్దార్లు అశోక్, రవీందర్, డీటీ ప్రదీప్, ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్ఐలు రాజు,రాంచందర్, సర్వేయర్లు పాల్గొన్నారు. అనంతరం కొండాపూర్ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని సూచించారు.

రాజీమార్గంతో కక్షిదారులకు ప్రయోజనం

- సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.కవితాదేవి

జహీరాబాద్/మెదక్ కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : రాజీమార్గంతో కక్షిదారులకు ప్రయోజనం చేకూరనుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.కవితాదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో ప్యానెల్ న్యాయవాదులు తదితరులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కక్షిదారుల ప్రయోజనార్థం కోర్టుల ఆధ్వర్యంలో నిర్వహించే లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే కక్షిదారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జూన్ 14న కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై అందరూ విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు. రాజీపడే కేసులను పరిష్కరించుకోవాలని మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సుభవల్లి పేర్కొన్నారు. బుధవారం మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో న్యాయవాదులు రజీమ్ ఉన్నీసాబేగం, కరుణాకర్, శ్రీరామశర్మ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను తక్షణమే ప్రారంభించాలి


వెల్దుర్తి మండలంలోని కుకునూర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

వెల్దుర్తి, మే 7 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యాన్ని నిరసిస్తూ మండల పరిధిలోని కుకునూర్ చౌరస్తా వద్ద రైతులు బుధవారం రోడ్డుపై బైఠాయించారు. రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని నిర్వాహకులను అడిగితే హమాలీలు రావడం లేదనే సాకుతో తూకం వేయడం లేదన్నారు. అకాల వర్షాలకు ధాన్యం అంతా తడిసిపోతుందని, మళ్లీ మళ్లీ ధాన్యాన్ని ఆరబెట్టాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న తహసీల్దార్ బాలలక్ష్మి, సొసైటీ చైర్మన్ అశోక్, ఆర్ఐ నర్సింగ్ యాదవ్ హమాలీలను పిలపించి కొనుగోళ్లు ప్రారంభిస్తామని హామీఇవ్వడంతో ధర్నా విరమించారు. ఇదిలా ఉండగా తహసీల్దార్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి సీరియల్ ప్రకారం ధాన్యం తూకం వేయాలని, లారీలు లేకపోతే ట్రాక్టర్ల ద్వారా తూకం వేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలి: డీఈవో

వెల్దుర్తి, మే 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. జిల్లాలోని 21 మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. వెల్దుర్తిలో నిర్వహిస్తున్న క్యాంపులో 65 మంది మాత్రమే ఉన్నారని, విద్యార్థులు ముందుకొచ్చి క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఈవో వెంట ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య ఉన్నారు.

కేతకీలో సంగారెడ్డి ఎస్పీ పూజలు


ఎస్పీకి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

ఝరాసంగం, మే 7 (ఆంధ్రజ్యోతి) : కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఎస్పీ పరితోష్ పంకజ్ కుటుంబ సమేతంగా పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదామంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి వారికి వారిచే ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ చైర్మెన్ చంద్రశేఖర్, ఆలయ ఈవో శివరుద్రప్ప శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


వేంకటేశ్వరస్వామి కల్యాణంలో స్వామీజీలు

నారాయణఖేడ్, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆకుల లింగాపూర్‌లో బుధవారం వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం బండ్ల ప్రదర్శన, లాజ హోమం, రాత్రి రేణుకాఎల్లమ్మ వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వర్‌మహరాజ్, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, మాజీ ఎమ్మెల్యేలు విజయపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్, టీపీసీసీ సభ్యుడు నగేష్‌షెట్కార్, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, లింగాపూర్ మాజీ సర్పంచ్ సతీష్, రాధాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

కొండాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : కొండాపూర్ మండల మారెపల్లిలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు మూలమంత్ర హవనము, మహాపూర్ణాహుతి చక్రస్నానం, పుష్పయాగంతో బుధవారం ముగిశాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదానం ఏర్పాటు చేయించారు.

నర్సంపల్లిలో పెద్దమ్మతల్లి వార్షికోత్సవ వేడుకలు

తూప్రాన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం నర్సంపల్లి గ్రామంలో బుధవారం పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని పూజారి దత్తుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముదిరాజ్ సంఘ సభ్యులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు.

వైభవంగా కన్యకా పరమేశ్వరీ ప్రతిష్ఠాపన

నర్సాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలో నిర్మించిన వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠాపనలు బుధవారం వైభవంగా నిర్వహించారు. గోపూజ, గణపతిపూజ, ధ్వజారోహణం, అఖండ దీపస్థాపన తదితర ప్రత్యేక పూజలు పూజారి మురళీపంతులు బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు శ్రీనివాస్‌గుప్తా, పబ్బ మహేశ్‌గుప్తా, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి తిరు కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

శివ్వంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొంతి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రెండోరోజు వేణుగోపాలస్వామి తిరు కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు అమరేందర్‌రెడ్డి, అరుణారెడ్డి, సంజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న సిద్ధేశ్వరానందగిరి మహరాజ్

పాపన్నపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గామాతను సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దీపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమం పీఠాధిపతి సిద్ధేశ్వరానందగిరి మహరాజ్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, సత్కరించారు. ఇందులో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, అర్చకులు శంకర్‌శర్మ, రాముశర్మ ఉన్నారు.


సంగారెడ్డిలో వాసవీ కన్యకా పరమేశ్వరీ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు


నారాయణఖేడ్: వాసవీమాత జయంతిలో భాగంగా పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

కన్యకాపరమేశ్వరీ జయంతి

ఆర్యవైశ్య కుల దైవమైన వాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతిని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే వాసవీమాత ఆలయంలో పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, లలిత నామపారాయణం పఠించారు. కొన్ని ప్రాంతాల్లో ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ఓడి బియ్యం సమర్పించి, మంగళ హారతి నిర్వహించారు. న్యూస్ నెట్‌వర్క్

ఇప్పట్లో లేనట్టే!

(3వ పేజీ తరువాయి)

నిధులు విదల్చడం లేదు. ఫలితంగా ఏడాది కాలం నుంచి గ్రామాల్లో ఆర్థిక మాంద్యం నెలకొంది. చిన్నాచితక పనులకు జనరల్ ఫండ్‌తోనే నెట్టుకొస్తున్నారు. కొన్ని సమస్యల విషయంలో కార్యదర్శులు సైతం చేతులెత్తేసే పరిస్థితి దాపురించింది. ప్రత్యేకాధికారుల పాలనలో పల్లెలు కుంటుపడుతున్నాయనే ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి.

జిల్లా	గ్రామపంచాయతీలు	వార్డులు
సంగారెడ్డి	633	5,558
సిద్దిపేట	508	4,508
మెదక్	492	4,220

దళితులపై దాడులు అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న అతివేల మాణిక్ తదితరులు

హత్నూర, మే 7 (ఆంధ్రజ్యోతి) : దళితులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతివేల మాణిక్ డిమాండ్ చేశారు. హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన రాజీవ్‌గాంధీ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం స్థానిక దళితులతో సమావేశమై అక్కడ జరుగుతున్న అఘాయిత్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. కొన్యాల చెరువు కింద పంటలు వేసుకున్న దళితుల పొలాలకు సాగునీరు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా ఆరుగాలం శ్రమించి వేసిన పంటలకు సరైన సమయంలో నీరందక పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో పంట పొలాలకు నీరు పెట్టుకునేందుకు వెళ్లిన దళితుడైన రాజీవ్‌గాంధీపై అకారణంగా దాడిచేసి తీవ్రంగా గాయపర్చి అవమానపర్చారని ఆయన తెలిపారు. రాజీవ్ గాంధీపై దాడి చేసిన వ్యక్తులపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మాణిక్ డిమాండ్ చేశారు. లేని ఎడల పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

కొలతల ప్రకారం పనిచేయాలి : ఎంపీడీవో

ఝరాసంగం, మే 7 (ఆంధ్రజ్యోతి) : కొలతల ప్రకారం ఉపాధిహామీ పనులు చేపడితే రోజువారి కూలీ రూ.307 వరకు వస్తుందని స్థానిక ఎంపీడీవో సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. కూలీ పనులకు వచ్చి నామమాత్రంగా పనులు చేసి వెళ్తే అనుకున్నంత డబ్బులు రావన్నారు. ఆయన వెంట ఏపీవో రాజ్‌కుమార్ ఉన్నారు.

'ప్రభుత్వ భూమిని కాపాడాలి'

నర్సాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం రామచంద్రాపురం గ్రామ పరిధిలో సర్వే నెంబరు 94లో ఉన్న 20 గుంటల ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్థులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు శ్రీశైలం, లక్ష్మీనారాయణ, పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ సర్వే నెంబరు 94లో హనుమాన్ మందిరంతో పాటు దానికి సమీపంలోనే 20 గుంటల భూమి ఉన్నదని చెప్పారు. అయితే గ్రామానికి చెందిన కొందరు సదరు భూమిని ఆక్రమించి ఈతచెట్లు పెట్టాలని చూస్తున్నారని, ఆక్రమణకు గురికాకుండా ఆలయానికి ఉపయోగపడేలా చూడాలని తహసీల్దార్‌ను కోరారు.

రోడ్డుకు ఇరువైపులా చెట్ల నరికివేత

నారాయణఖేడ్, మే 7 (ఆంధ్రజ్యోతి) : అకోలా-హైదరాబాద్ జాతీయ ప్రధాన రహదారి నుంచి జంబికుంట వరకు రోడ్డుకు ఇరువైపులా మాజీ సర్పంచ్ సాయమ్మ ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితం నాటిన చెట్లను విద్యుత్ అధికారులు బుధవారం నరికి వేయించారు. చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ విషయమై విద్యుత్ ఏఈ యాసిన్ అలీని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. జంబికుంట గ్రామస్థులు గ్రామానికి విద్యుత్ కావాలని కోరారని, వారి అభిప్రాయం మేరకు చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించామని వెల్లడించారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

టేక్మాల్/పాపన్నపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్డీవో రమాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన టేక్మాల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాలు పడుతున్న కారణంగా వెంటనే తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. బుధవారం ఆమె పాపన్నపేట మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

వట్‌పల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవనూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి సొసైటీ చైర్మన్ వినోద్‌గౌడ్‌తో పాటు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మీశేషారెడ్డిని కూడా ఆహ్వానించారు. ఇంతవరకు బాగానే ఉన్నా రిబ్బన్ కట్ చేసే సమయంలో ప్రొటోకాల్ రగడ తలెత్తింది. సొసైటీ చైర్మన్ రిబ్బన్ కట్ చేస్తుండగా.. చైర్‌పర్సన్ భర్త శేషారెడ్డి అడ్డుకుని 'రిబ్బన్ నువ్వు ఎలా కట్‌చేస్తావు.. తన భార్య, చైర్‌పర్సన్ లక్ష్మి కట్ చేస్తుంది' అని అడ్డుకున్నారు. 'మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం కాబట్టి.. తామే కట్‌చేస్తాం' అని వినోద్‌గౌడ్ బదులిచ్చారు. ఇంతలో సీఈ శ్రీకాంత్ కలుగజేసుకుని ప్రొటోకాల్ ప్రకారం.. చైర్మన్ రిబ్బన్ కట్ చేయాలని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కచురరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్ జోషి పాల్గొన్నారు.

సికింద్లాపూర్ హుండీ లెక్కింపు

శివ్వంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సికింద్లాపూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయం హుండీని బుధవారం దేవాదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో శివ కేశవ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు లెక్కించారు. ఐదునెలలకు సంబంధించి రూ.4 లక్షల 14 వేల 833 వచ్చినట్లు చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో శశిధర్‌గుప్తా, ఆలయ ప్రధాన పూజారి ధనుంజయశర్మ, సిబ్బంది నర్సింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కానుకల రూపంలో వచ్చిన వెండి ఆభరణాలను లెక్కించకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదని భక్తులు ఆరోపిస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

చేగుంట, మే 7 (ఆంధ్రజ్యోతి) : లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన చేగుంట మండల పరిధి చిన్న గ్రామ శివారులోని చేగుంట-గజ్వేల్ రహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన తోడంగి లింగం(50) దౌల్తాబాద్ నుంచి చేగుంట వైపు వెళ్తుండగా లారీ ఢీకొని మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్‌షాపులో తనిఖీ

నిజాంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : 'రేషన్ పంపిణీలో నయా మోసం' అన్న కథనం బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి, మండల పరిధిలోని రజాక్‌పల్లి గ్రామంలోని రేషన్ దుకాణాన్ని సివిల్ సప్లయ్ అధికారులు సందర్శించారు. బియ్యంలో చాలా రకాలు ఉంటాయని, ఏదేమైనా విచారణ చేస్తమని తెలిపారు. డీలర్లు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.